## కథ



**ఆదుర్తి బాల**

# యాక్సిడెంట్

ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. చూస్తుండగానే ఉరుములు, మెరుపులతో వాన మొదలయ్యింది. పట్టపగలే చీకట్లు కమ్మినట్టుగా ఉంది వాతావరణం. పిడుగుల శబ్దం అంటే చచ్చేంత భయం మాధవికి. తన భయం చూసి భర్త శశాంక్ నవ్వేవాడు.

"పిచ్చిదానా ఎందుకంత భయం" అంటూ దగ్గరకు తీసుకొని ధైర్యం చెబుతున్నట్టుగా వెన్నురాసేవాడు.

అతడలా అంటుంటే భయమంతా ఎగిరిపోయి ఎంతసేపైనా అలాగే ఉండిపోవాలనిపించేది. 'ఫెట్టనికోటలాటి అతని బాహుబంధంలో ఇమిడిపోయినపుడు ప్రళయమొచ్చినా దిగులుండదు తనకి' అనుకుంది మాధవి.

ఎక్కడో ఫెళఫెళ శబ్దంతో పిడుగు పడింది. ఒక్కసారిగా ఉలిక్కిపడి తన ఆలోచనలలోంచి బైటకొచ్చింది మాధవి. వర్షానికి తెగిపడే కరెంటు తీగలు, ఒరిగిపోయే కరెంటు స్తంభాలూ గుర్తొచ్చాయి మాధవికి.

'నా పిల్లల్ని జాగ్రత్తగా ఇల్లు చేర్చు స్వామీ' అంటూ మనసులోనే దేవుడిని ప్రార్థించింది. మాధవి దేవుడు ఆమె మొర ఆలకించాడు కాబోలు. కొంతసేపటికి వర్షం ఉధృతి తగ్గి సన్నటి జల్లు మొదలైంది. మబ్బులు చెదిరిన ఆకాశం నీరెండ వెలుగులు పరుచుకున్నాయి.

వీపున స్కూలు బ్యాగులూ, చేతిలో ప్లాస్టిక్ బుట్టలతో గేటు తీసుకొని పరిగెట్టుకుంటూ వచ్చారు మాధవి పిల్లలు స్వాతి, శ్రీరామ్. వస్తూనే స్కూలు బ్యాగులొకవైపూ, బూట్లు ఒక వైపూ విసిరిపడేసి ఇల్లంతా పరుగులు పెడుతూ ఆడడం మొదలుపెట్టారు. పంజరం నుండి బైట పడిన పక్షుల్లా వాళ్లలా స్వేచ్ఛగా ఆడుతుంటే చూసి నవ్వుకుంటూ వాళ్లకి పాలు కలిపి తీసుకురావడానికి వంటింట్లోకి నడిచింది మాధవి. పిల్లలిద్దరూ పాలు తాగాక ఇద్దరికీ చెరో ప్లేటులో పకోడీలు వేసి తెచ్చింది. పకోడీలు తింటూ టీవీలో కార్టూన్ షో చూస్తున్నారు పిల్లలు. శశాంక్‌కి క్యాబేజీ పకోడీలంటే చాలా ఇష్టం. పెళ్లయిన కొత్తలో సాయంత్రం ఐదవ్వగానే ఇంటికొచ్చేసేవాడు శశాంక్. పళ్లెం నిండా క్యాబేజీ పకోడీలతో అతనికి స్వాగతం చెప్పేది మాధవి. అవి తింటూ ఇద్దరూ టీవీ చూసేవారు. కబుర్లు చెప్పుకునే వారు ఎనిమిదిన్నరకల్లా భోజనం చేసి తొమ్మిదింటికి బెడ్‌రూం చేరుకునేవారు. పాలనురుగులాంటి బెడ్‌షీట్ పరచిన డబుల్‌కాట్ వేదికగా వారి సరస సరాగాలతో, ముద్దుముచ్చట్లతో కాలం దొర్లిపోయేది. ఏ ఝాములో నిద్రపోయే వారో భళ్లున తెల్లవారితే "అబ్బ అప్పుడే తెల్లవారిపోయిందా" అనిపించేది మాధవికి.

"నువ్వు చదూకున్నావుగా ఏదైనా జాబ్‌కి ట్రై చేయాలనుందా?" అనేవాడు శశాంక్. ఆడవాళ్లు ఉద్యోగాలకెడితే ఇల్లెలా ఉంటుందో తెలియనిది కాదు మాధవికి. ఇల్లు తీరుగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, ఇంటి పట్టునే ఉండి భర్తకీ, పిల్లలకీ అన్నీ టైంకి అమరుస్తూ మంచి ఇల్లాలుగా ఉండాలని మాధవి కోరిక. ఆ మాటే చెప్పింది భర్తతో.

అతడు నవ్వి "హమ్మయ్య నువ్వెక్కడ ఉద్యోగం చేస్తానంటావోనని బెంగపడ్డాను. ఎందుకంటే నేను ఇంటికొచ్చేసరికల్లా ఫ్రెష్‌గా తయారై కాఫీ కప్పుతో ఎదురొచ్చే భార్య రావాలని ఆశపడ్డాను. అలాగని నా స్వార్థం కోసం నీ ఇష్టాలని కాదనకూడదు కదా! నీ అభిప్రాయాలని గౌరవించడం నా బాధ్యత కదా!" అన్నాడు.

తనని అర్థం చేసుకున్న భర్త దొరికినందుకు పొంగిపోయింది మాధవి. కాలక్రమంలో అతడికి రెండు ప్రమోషన్లొచ్చాయి. హోదా పెరిగింది. తను ఇద్దరు బిడ్డల తల్లి అయింది. తన భర్త హోదా గురించి ఎవరికైనా చెప్పేటప్పుడు ఆ హోదా ఏదో తనకే వచ్చినంత గర్వంగా ఉండేది మాధవికి. కార్టూన్ షో అయిపోవడంతో పిల్లలు అల్లరి మొదలుపెట్టారు. గతం తాలూకు ఆలోచనల నుండి బైటపడి పిల్లలిద్దరికీ స్నానం చేయించి ఉతికిన బట్టలు వేసింది మాధవి. వాళ్ల చేత హోంవర్కు చేయించి కథలు చెబుతూ అన్నం తినిపించింది.

"అమ్మా పింకీ వాళ్ల డాడీ ఎంత మంచివాడో. రోజూ ఆఫీసు నుండి వచ్చేటపుడు పింకీకి బోల్డన్ని చాక్లెట్స్ తెస్తాడట. రోజూ స్కూటరు మీద ఎక్కించుకొని బజారు తీసుకెడతారుట" అన్నది స్వాతి.

"మా ఫ్రెండూ వాళ్ల డాడీ అయితే వాడిని జెయింట్ వీల్ ఎక్కిస్తానని, ఎగ్జిబిషన్‌లో మంచి డ్రెస్‌లు, బొమ్మలూ కొంటానని ప్రామిస్ చేశాడట. వాడు చెప్తుంటే నాక్కూడా నాన్న అలా చేస్తే బాగుండనిపించింది" అన్నాడు శ్రీరామ్.

మనసు కలుక్కుమంది మాధవికి. పిల్లలు తండ్రినెంతగా మిస్సవుతున్నారో తండ్రి ప్రేమలో సేదతీరాలనే కోరిక వారిలో ఎంత గాఢంగా ఉందో పాపం! అనిపించింది మాధవికి.

"నాన్న ఎప్పుడూ లేటుగా వస్తారెందుకమ్మా" కళ్లు చక్రాల్లా తిప్పుతూ అడిగింది స్వాతి. మాధవి నోరు విప్పకుండానే ఆరిందలాగా అన్నాడు శ్రీరామ్.

"మన నాన్న అందరి డాడీలలాగా కాదు. నాన్నకి పెద్ద ఉద్యోగం. ఎప్పుడూ బిజీగా ఉంటారు కాబట్టి లేటుగా వస్తారు"

అది మాధవి పిల్లలకెపుడూ చెప్పే సమాధానమే!

"రేపు నాన్నని త్వరగా వచ్చేయమని చెప్తాను సరేనా" పిల్లలిద్దర్నీ దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకుంటూ అన్నది మాధవి.

శశాంక్ ఈమధ్య రోజూ లేటుగానే వస్తున్నాడు ఇంటికి. ఉద్యోగంలో హోదా పెరిగితే బాధ్యతలూ వాటితో పాటు చికాకులూ పెరుగుతాయి. అందుకే భర్త ఎంత లేటుగా వచ్చినా అతడి ఆలస్యానికి కారణాలడిగి విసిగించదు మాధవి. అతడెంత లేటుగా వచ్చినా భోంచేయకుండా అతడి కోసం కనిపెట్టుకుని కూర్చుంటుంది.


దాదాపు పదిన్నర అవుతుండగా వచ్చాడు శశాంక్. అతడు ఫ్రెష్ అయి వచ్చేలోపు డైనింగ్ టేబుల్ మీద కంచాలు, మంచినీళ్లు పెట్టింది. అన్నం, సాంబారూ వేడి చేసి ఉంచింది.

"మా ఫ్రెండు పార్టీ ఇచ్చాడు. బైట తినేశాను" పొడిగా అన్నాడు శశాంక్. ఆ సంగతి ఫోన్ చేసి చెప్పొచ్చుగా. అతడి కోసం కనిపెట్టుకుని ఉంటుందని తెలుసు కదా" అనుకుంది మాధవి.

"పోనీ నేను తినేవరకూ ఇక్కడే కూర్చోండి" ఆశగా అంది మాధవి.

"సారీ మధూ చాలా అలసటగా ఉంది" మాధవికి ఇంకొక మాట మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా వెళ్లిపోయాడు శశాంక్.

మనసంతా ఏదో వెలితి! తెలియని అగాథమేదో ఇద్దరి మధ్యా పెరుగుతున్నట్టనిపించింది మాధవికి. పెళ్లయిన కొత్తల్లో ఎంత హుషారుగా ఉండేవాడు. ఈ మనిషికి కోపం అనేది ఉండదేమో అనిపించేది మాధవికి. ఇప్పుడు మారిపోయాడు శశాంక్. ఎప్పుడూ మూడీగా, చిరాగ్గా ఉంటాడు. ఒకటి రెండుసార్లు కారణం తెలుసుకోడానికి ప్రయత్నించింది మాధవి. అతడు జవాబు చెప్పకుండా దాటవేయడంతో చేసేదేమీ లేక ఊరుకుంది.



అతని బాధని పంచుకోలేకపోతున్నందుకు బాధపడింది. ఏదో తిన్నాననిపించి డైనింగ్ టేబుల్ సర్దేసి బెడ్ రూంలోకి వచ్చింది మాధవి. బెడ్ మీద పరధ్యానంగా కూర్చున్న భర్తని చూసింది. అతని పక్కగా వచ్చి అతడిని ఆనుకుని కూర్చుంది మాధవి. ఇబ్బందిగా కదిలాడు శశాంక్. అదేమీ పట్టించుకోలేదు మాధవి. అతని అరచేతిని తన చేతిలోకి తీసుకుంది. పని పాటలతో మోటుబారిన ఆమె చేయి గరుకుగా అనిపించింది శశాంక్‌కి. ఆమె చేతిని నెమ్మదిగా పక్కకి తోసేశాడు.. వింతగా అనిపించింది మాధవికి. చటుక్కున తన చేయి వెనక్కి తీసేసుకుంది.

"మీరీ మధ్య అదోలా ఉంటున్నారు. మాటిమాటికి చిరాకు పడుతున్నారు. నేనెన్నిసార్లు కారణమడిగినా సరిగా చెప్పట్లేదు. ఆఫీసులో చికాకుల్లో ఒంట్లో బాగుండట్లేదా. మీరీ రోజు చెప్పి తీరాల్సిందే" అంది మాధవి.

"చెపితే ఏం చేస్తావ్? నా బాధ పోగొట్టగలవా? నా సమస్య తీర్చగలవా"

"మీ సమస్యకి పరిష్కారం నా చేతుల్లో ఉంటే తప్పకుండా తీరుస్తాను"

"మాట తప్పవుగా"

"పదిసార్లు మాట ఇవ్వడం నాకలవాటు లేదు. మీ బాధేంటో చెప్పండి."

"అయితే విను. నాకు నీ నుండి విడాకులు కావాలి. నేను మా ఆఫీసులో పనిచేసే ఇంద్రాణిని పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను" ఏ ఉపోద్ఘాతం లేకుండా అన్నాడు శశాంక్.

ఒక్కసారి తనేం విన్నదో అర్థం కాలేదు మాధవికి. "జోకులు వేసి ఏడిపించడానికి ఇదా సమయం" బలవంతాన నవ్వు తెచ్చుకుంటూ అంది.

"నేను సీరియస్‌గానే అన్నాను" ఎటో చూస్తూ అన్నాడు శశాంక్.

తన ఆశల సౌధం కూలిపోతున్నట్టూ... తనది అనుకున్న అమూల్యమైన వస్తువునెవరో లాక్కుపోతున్నట్టు అనిపించింది మాధవికి. ఏం మాట్లాడాలో తెలియని అయోమయం."

"ఇంద్రాణి చాలా బాగుంటుంది. నేనంటే ప్రాణం పెడుతుంది. నేను లేకుండా బతకలేనంటోంది"

"నేనూ మిమ్మల్ని ప్రాణాధికంగా ప్రేమించాను.. మీరు లేకుండా నేను మాత్రం బతకగలనా? పోనీ నా కోసం కాకపోయినా అభంశుభం తెలియని పిల్లల కోసమైనా మీ నిర్ణయం మార్చుకోలేరా? వారికి తండ్రి ప్రేమని

దూరం చేసే హక్కు ఎవరిచ్చారు మీకు"

అతడు జవాబు చెప్పలేదు.

"పెళ్లయి పదేళ్లయిన తరువాత నాలో ఏం లోపం కనిపించింది మీకు"

దుఃఖంతో గొంతు బొంగురు పోతుండగా అడిగింది మాధవి.

"ఎంతసేపూ ఇల్లూ, పిల్లలూ తప్ప నా కోసం ఏం చేశావు నువ్వు? భర్తకి వండి వార్చి పెడితేనో, బట్టలుతికి పెడితేనో సరిపోతుందా? నా కోసం నాజుగ్గా ఉండాలని తెలీదా? ఒక్కసారి అద్దంలో చూసుకో"

భర్త నోటి వెంట వచ్చిన ఈటెల్లాంటి మాటలు గుచ్చుకున్నాయి మాధవికి. తను నాజుగ్గా ఆకర్షణీయంగా లేదు. భర్త ఉదాసీనతకి ఇదా కారణం. రెండు అబార్షన్లు, రెండు సిజేరియన్లూ అయి ముప్పై నిండకుండానే చచ్చి బతికిన శరీరం. స్లిమ్‌గా ట్రిమ్‌గా తయారై ఉండడానికి తనేమైనా మోడలింగ్ చేస్తోందా? ఏమన్నాడూ ఆయన కోసం తనేమీ చేయలేదా?"

పొద్దున్న బ్రష్ మీద పేస్టువేసి ఇచ్చింది మొదలు ఆఫీసుకి వెళ్లే ముందు కర్చీఫ్ చేతికందించే వరకూ అన్నీ తనే దగ్గరుండి చూసుకుంటుంది ఇప్పటికీ. అతడికిష్టమైన చీరలే కడుతుంది. అతడికిష్టమైన వంటలే వండుతుంది. అతడి ఇష్టాలూ, అలవాట్లూ తనవిగా చేసుకొని తన అస్తిత్వాన్ని మరచిపోయి పరాధీనంగా మిగిలిపోయింది తను. బహుశ తను చేసిన తప్పు అదేనేమో. ఇంట్లో ఎక్కడికక్కడ పొందికగా అమర్చబడ్డ వస్తువులూ శుభ్రంగా ఉతికిన బెడ్‌షీట్లు, కర్టెన్లూ వెక్కిరిస్తున్నట్టుగా కనిపించాయి. ఇంటిని ఇలా ఉంచడానికి తను పడిన శ్రమని తన కెరీర్ కోసం వినియోగిస్తే ఈ రోజు తనకీ ఓ మంచి పొజిషన్ వచ్చేది. ఇప్పుడులా ఉన్న పళంగా వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్లగలదు తను. అమాయకంగా నిద్రిస్తున్న పిల్లల్ని చూడగానే దుఃఖం పొంగింది మాధవికి.

"లాయర్‌తో మాట్లాడి విడాకుల పేపర్లు రెడీ చేస్తాను. నా సుఖం కోరుకునే దానివే అయితే సంతకం పెట్టు"

ఇక మాట్లాడాల్సింది లేదన్నట్టు అటు తిరిగి పడుకున్నాడు శశాంక్.

ఇంద్రాణి రూపం కళ్ల ముందు కవ్విస్తుంటే జోరుగా బైక్ నడపసాగాడు శశాంక్. ఆ పరధ్యానంలో ఎదురుగా వచ్చే లారీని గుద్దేశాడు. కాలు ఫ్రాక్చరైంది. ఆపరేషన్ చేశాడు డాక్టర్. బంధుమిత్రులంతా వచ్చి పలకరిస్తూ శశాంక్‌కి ధైర్యం చెబుతున్నారు. మాధవి ఒక్క క్షణం కూడా భర్తనొదిలి ఉండట్లేదు. నిద్రాహారాలు మాని వేళకు మందులూ, పళ్ల రసాలూ అందిస్తోంది.

భార్య చేత సేవలు చేయించుకోవడం శశాంక్‌కి గిల్టీగా ఉంది. ఈ సేవలన్నీ ఇంద్రాణి చేస్తే బాగుండునని పిస్తోంది. ఇలాటప్పుడు ఇంద్రాణి తన పక్క నుంటే ఎంత ఓదార్పుగా ఉంటుందీ అనిపించిందతనికి. అప్పుడు స్ఫురించింది శశాంక్‌కి. అంతవరకూ ఇంద్రాణి తనని చూడడానికి రాలేదని. గబగబా సెల్ తీసి ఇంద్రాణి నెంబర్ నొక్కాడు. అవతల రింగ్ టోన్ వినిపిస్తోంది. కానీ ఇంద్రాణి సెల్ తీయట్లేదు. డిస్‌ప్లేలో తన నెంబరు వస్తుంది. కనుక ఫోన్ చేసింది ఎవరో తెలుసు ఇంద్రాణికి. తెలిసీ ఎందుకు మాట్లాడట్లేదు? తనకి యాక్సిడెంట్ అయిందని ఆఫీసులో అందరికీ తెలిసినప్పుడు తనకి మాత్రం తెలియకుండా ఉంటుందా? తను హాస్పిటల్‌లో ఉన్నాడని తెలిసీ తనని చూడడానికి రాలేదంటే అర్థం ఏమిటి? ఆలోచనలతో పిచ్చెక్కిపోతోంది శశాంక్‌కి. చివరిసారిగా ప్రయత్నిద్దామని మళ్లీ ఫోన్ చేశాడు. ఇక విసిగి వేసారిపోతుండగా ఫోన్ తీసింది ఇంద్రాణి.

"శశాంక్ మీకు యాక్సిడెంట్‌లో కాలు తీసేశారని నాకు తెలుసు. ఏ ఆడ పిల్ల అయినా హాండ్సమ్‌గా ఉండే భర్త కావాలనుకుంటుంది. కానీ హాండీకాప్‌ని కోరుకోదు అర్థమైందనుకుంటాను" అని ఫోన్ కట్ చేసింది. నాకు కాలు తీయడమేమిటి తనలో తనే గొణుక్కున్నాడు శశాంక్.

"సారీరా. యాక్సిడెంట్‌లో నీ కాలు పోయిందని ఇంద్రాణికి నేనే అబద్ధం చెప్పాను. ఆమె గురించి నీకు తెలియాలనే ఈ అబద్ధం ఆడాను. ఈపాటికి ఆమె క్యారెక్టర్ ఏమిటో నీకర్థమయ్యే ఉంటుంది. నువ్వు ఆ మాయలాడి వలలో పడి కట్టుకున్న ఇల్లాలికి అన్యాయం చేయకూడదనే ఈ నాటకం అంతా" అన్నాడు శశాంక్ ప్రాణస్నేహితుడు శ్రీధర్.

భర్త చేతికి బత్తాయి రసం అందించింది మాధవి.

అతడి చేతిలో చిరిగి ముక్కలవుతున్నాయి డైవర్స్ పేపర్సు.

భార్య సపర్యలతో త్వరగా కోలుకున్నాడు శశాంక్.

ఆరోజు - దీక్షగా చదూకుంటున్న భార్యతో అన్నాడు శశాంక్.


"ఏమిటి మధూ చదువుతున్నావ్"

నిట్టూర్చింది మాధవి.

"జీవితం ఓ ప్రయాణం లాంటిది. ప్రయాణంలో అప్పుడప్పుడూ యాక్సిడెంట్స్ జరిగి గాయాలవుతుంటాయి. మీ శరీరానికి తగిలిన గాయం మీకు భార్య విలువ తెలిసేట్టు చేసింది. నా మనసుకు తగిలిన గాయం నన్ను పరాధీనంగా బతుకీడ్చింది. ఉద్యోగాన్వేషణలో పోటీ పరీక్షలకి ప్రిపేరవుతున్నాను. భవిష్యత్తులో ఎప్పుడైనా నాకు యాక్సిడెంట్ అయితే నేను నిలదొక్కుకోవాలిగా"

కాటుక ముద్దల్లాటి మేఘాలతో ఆకాశం నల్లబడింది. కుండపోతగా కురుస్తోంది వర్షం. కర్ణభేరి పగిలేంత శబ్దంతో ఉరిమింది ఆకాశం. భయపడకుండా ఉండడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది మాధవి.

○



## సోయగాల షీలా

నల్లపిల్ల షీలా నటించిన తొలిచిత్రం 'సీతాకోకచిలుక' అయినా 'పరుగు'తో వెలుగులోకి వచ్చింది. అలాంటి హిట్ సినిమా చేసినా చెప్పుకోదగిన చాన్సుల్ని టాలీవుడ్ నుంచి పొందలేకపోయినా షీలా ఇప్పుడు కన్నడ రంగంలోకి అడుగుపెడుతోంది. ఇటీవల వచ్చిన 'మస్కా' సినిమాలో ప్రేక్షకులకు తన అందాలతో కనువిందు చేసిన షీలా తన తొలి కన్నడ చిత్రం నుంచే అందాల విందు చేయడానికి రెడీ అయిపోయిందంటున్నారు కన్నడ సినీవాలాలు. బయట పార్టీలకు, ఫంక్షన్లకు కూడా పొట్టి పొట్టి డ్రెస్సులేసుకుని నలుగురి దృష్టినీ ఆకట్టుకుంటోందిట.